క్లుప్తంగా

పెద్దాసుపత్రికి వైద్యపరికరాలు విరాళం



డాక్టర్ వెంకటరంగారెడ్డికి వైద్య పరికరాలు విరాళంగా ఇస్తున్న రేణుక హాస్పిటల్ సిబ్బంది లింగన్న

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బుధవారం రేణుక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డికి హాస్పిటల్ అధినేత డాక్టర్ జె. రఘునాథ్‌రెడ్డి అందజేశారు. విరాళం ఇచ్చిన వాటిలో రెండు సక్షన్ ఆపరేటర్లు, ఐదు బీపీ ఆపరేటర్లు ఉన్నాయి.

దివ్యాంగుల నిరసన

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లలో దివ్యాంగుల సంక్షేమానికి నిధులను కేటాయించకపోవడం అన్యాయమని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కురువ ఎల్లప్ప అన్నారు. బుధవారం దివ్యాంగులతో కలిసి కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ ప్రతులను తగలబెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్ ప్రకారం బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమం కోసం 5 శాతం నిధులను కేటాయించాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి మద్దిలేటి, మక్బుల్‌బాషా, భగవంతుడు, సురేష్‌నాయుడు, వీరాంజి, సూరి పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా 'మేడ్'



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్లవేళలా మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్(మేడ్) అండగా నిలుస్తోందని జిల్లా అధ్యక్షురాలు బైరపోగు బెన్నమ్మ అన్నారు. బుధవారం స్వర్గీయ దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా మేడ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు కె. బాబు, ఎస్ సుధాకర్‌బాబు, బి.మద్దిలేటి, జేడీ కార్యాలయ పర్యవేక్షకులు శివారెడ్డి, బి.వీరప్రకాష్, డీబీఆర్‌సీ కన్వీనర్ వేల్పుల జ్యోతి, వసతి గృహ సంక్షేమాధికారులు రమేష్, నాగమద్దయ్య, రజనీ, సులోచన తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందుగా దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నేడు పీఆర్‌అండ్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు రాక

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం, కర్నూలు రూరల్ మండలంలోని సచివాలయాలను తనిఖీ చేయనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు వైఎస్సార్ జగనన్న కాలనీలు, పీఆర్ రోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్‌లపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. అనంతరం 3 నుంచి 4 గంటల వరకు సెర్ప్ సమావేశం, 4 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక ఎమ్మెల్యే, గ్రామ సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సర్పంచు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, మార్కెట్‌యార్డు చైర్మన్‌లతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు.

కనుల పండువగా పెద్దమ్మ దేవర

కల్లూరు: ఉలిందకొండ గ్రామంలో పెద్దమ్మ దేవర బుధవారం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. దేవర సందర్భంగా ఊరంతా బంధుమిత్రు పరివారంతో కళకళలాడింది. మాజీ ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి అమ్మవారికి పూజలు చేశారు.

ఆదర్శనీయులు సంజీవయ్య

● నగరంలో ఘనంగా మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు



దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, నాయకులు

కర్నూలు (టౌన్/సెంట్రల్) : నీతి, నిజాయితీలతో పదవులకే వన్నె తెచ్చిన మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య ఆదర్శనీయులని వక్తలు కొనియాడారు. బుధవారం ఆయన జయంతిని పురస్కరించుకుని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జిల్లా అధికారులు,కుల సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి,రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. దేశం గర్వించ దగ్గ నాయకుడు సంజీవయ్య అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. స్థానిక నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రైల్వే ప్రసాద్, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేదార్ నాత్, పార్టీ నాయకులు ప్రభుదాసు, జమ్మన్న, అబ్దుల్లా, రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

నగరపాలకలో...

నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో బుధవారం దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవయ్య దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.



కేఎంసీలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు,సిబ్బంది

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానం కలిగిన దామోదరం సంజీవయ్య ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. బుధవారం దామోదరం సంజీవయ్య 103వ జయంతిని పురస్కరించుకొని కళా వెంకట్రావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేశారు.

● జనసేన పార్టీ ఆధ్వర్యంలో నాయకులు చింతా సురేష్ బాబు, మంజునాథ్, సుధాకర్, షబ్బీర్, సతీష్ స్థానిక నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు డీఆర్వో కె.మధుసూదనరావు నివాళి అర్పించారు. బుధవారం సంజీవయ్య 103వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని వినాయక టెంపుల్ సమీపంలో ఉన్న ఆయన చిత్రపటానికి డీఆర్వో పూలమాల వేశారు. దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య కర్నూలు వాసి కావడం గర్వకారణమన్నారు.

కేఎంసీలో..

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో బుధవారం పూర్వ ముఖ్యమంత్రి, దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంజీవయ్య చేసిన సేవలను కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వక్తలు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.



రాయలసీమ యూనివర్సిటీలో..



నగరపాలక కార్యాలయంలో..

రాయలసీమ యూనివర్సిటీలో..

కర్నూలు కల్చరల్: దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని బుధవారం రాయలసీమవర్సిటీలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి.కృష్ణారెడ్డి సంజీవయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య అతి చిన్న వయస్సులోనే ముఖ్యమంత్రి అయిన దళిత నాయకులు అన్నారు. ఆయన కేంద్ర, రాష్ట్ర మంత్రిగా పదవులు చేపట్టి ఆదర్శంగా నిలిచారన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన నిరాడంబర వ్యక్తి అన్నారు.ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు

● జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి బోస్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, పాఠకులు సంజీవయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ మన రాష్ట్రంలో మొదటి దళిత ముఖ్య మంత్రిగా పనిచేసి ఖ్యాతి గడించారన్నారు. నిరుపేద కుటుంబ నుంచి వచ్చి నీతి, నిజాయితీగా పాలన సాగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం

● ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులతో కలెక్టర్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జీఓ నంబర్ 535లోని నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. బుధవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ అక్కడికే సమాచార శాఖ డీడీ జయమ్మను పంపి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆమెతో చెప్పించారు. అనంతరం ఆ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వగా 535 జీఓ ప్రకారం అర్హులకు న్యాయం చేస్తామని, జాబితాను మరోసారి పరిశీలించాలని తహసీల్దార్లను ఆదేశించినట్లు చెప్పారు. ఐదేళ్ల అనుభవం కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలం కేటాయించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర కోరారు.

అయోడిన్ లోపిస్తే థైరాయిడ్



అయోడిన్ గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): శరీరంలో అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ వ్యాధి వస్తుందని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ చెప్పారు. బుధవారం కర్నూలు నగరంలోని గడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దండిగేరి సచివాలయంలో అయోడిన్ లోపంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ అయోడిన్ (ఉప్పు)కు త్వరగా అవిరయ్యే లక్షణం ఉంటుందని, ఎండవేడిమి లేదా గాలి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. దానిని గాలి చొరబడని మూత ఉన్న డబ్బాలలో నిల్వ చేయాలని తెలిపారు. మనుషుల శారీరక ఎదుగుదలకు, మానసిక అభివృద్ధికి, గర్భస్థ పిండం, చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదలకు, పిల్లల్లో తెలివి తేటలకు అయోడిన్ ఎంతో ముఖ్యమన్నారు. గర్భిణులు తీసుకునే ఆహారంలో అయోడిన్ లేకపోతే మందబుద్ధి కలిగిన లేదా వినికిడి లోపం, మూగతనం వంటి సమస్యలు ఉన్న పిల్లలు జన్మిస్తారన్నారు. కొన్నిసార్లు గర్భస్రావం కూడా అవుతుందని చెప్పారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నపిల్లలు తప్పకుండా అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాత్విక, ప్రాజెక్షనిస్టు ఖలీల్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అకాడమిక్ ఇయర్ పూర్తి కాకముందే అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో డీఈఓ శ్యామూల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అక్రమంగా జనవరి నుంచే అడ్మిషన్లు చేస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నారాయణ, శ్రీచైతన్య, భాష్యం, ఎడిఫై అథెనా, హైదరాబాద్ పబ్లిక్ స్కూలు, ఢిల్లీ పబ్లిక్ స్కూలు మొదలైన పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ముగిసినట్లు చెప్పడం దారుణమన్నారు. వెంటనే ఆయా పాఠశాలలో జరిగిన అడ్మిషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, దామోదర్ పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో జిల్లాకు పతకాలు

కర్నూలు (టౌన్) : ఈనెల 7 నుంచి 11 వ తేదీ వరకు న్యూఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఇరువురు బాలురు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని కిక్ బాక్సింగ్ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జశ్వంత్ రెడ్డి, గుర్రం కళ్యాణ్ కిక్, లైట్ ఈవెంట్లలో బంగారు పతకాలు సాధించారని వెల్లడించారు.

క్రీడాకారులకు అభినందనలు

ఈనెల 9 నుంచి 11 వ తేదీ వరకు విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన వినయ్, ప్రశాంత్, అరవింద్, బాలాజీ పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తన స్వగృహంలో అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

కర్నూలు కల్చరల్: ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారిని బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. పి.మౌలాలి, బి. అరవింద్, ఎం.సూర్య ప్రకాష్, కె.ఎస్.ఎస్. హరివర్ధన్, ఎం.ఉష, కె. మహేష్ ఉత్తమ పర్సంటైల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కర్నూలు కల్చరల్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కర్నూలు-2 డిపో గ్యారేజ్‌లో రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్నూలు ఆర్‌టీఓ ఎస్.రమేష్ హాజరై మాట్లాడారు. అనతంరం 18 మంది ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కర్నూలు డీపీటీఓ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు-1, 2 డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్వామా దాడి మృతులకు నివాళి

కర్నూలు కల్చరల్ : జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామాలో 2019లో జరిగిన ఉగ్ర దాడిలో మరణించిన జవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. నగరంలోని 46వ వార్డు రైల్వే స్టేషన్ ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ దేశ రక్షణ కోసం అమరులైన జవానుల త్యాగాలు వృథా కాకూడదని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఖాన్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రామాంజనేయులు, ట్రెజరర్ లోకేశ్వరయ్య, ఇతర నాయకులు భూపాల్ శర్మ, శివయ్య శెట్టి, పర్ల శివ, గోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరి

ఓర్వకల్లు: గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి(డీఐఓ) ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఓర్వకల్లు మండలం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు, పిల్లలకు వేసిన టీకాల వివరాలను ఎప్పటికప్పుడు ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. ఆర్‌సీహెచ్, యూవిన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. తద్వార పిల్లలను వ్యాధుల భారి నుంచి కాపాడొకవచ్చని తెలిపారు. అలాగే 12 వారాల్లోపు గర్భిణులను నమోదు చేసుకుని సమయానుసారంగా ఆరోగ్య సేవలను అందించాలని సూచించారు. కాన్పుకు వెళ్లాల్సిన ఆస్పత్రిని ముందుగానే గుర్తించి వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మాతాశిశుసంరక్షణ సేవలను వారికి వివరించారు. గర్భిణులు ప్రధానంగా ఐరన్ ఎక్కువగా ఉన్న నువ్వులు, బెల్లం, రెడ్ కిడ్నీ బీన్స్, పచ్చని ఆకుకూరలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రతి గర్భిణికి అందజేయాలన్నారు. గర్భస్థ సమయంలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించి, బరువును చూసుకోవాలన్నారు.

బడుగు, బలహీన వర్గాల ధైర్యం వైఎస్ జగన్

● సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): బడుగు, బలహీన వర్గాల ప్రజల ధైర్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా ఆయా వర్గాల అభ్యున్నతికి వైఎస్ జగన్ కృషి చేశారన్నారు. బుధవారం స్థానిక సి. క్యాంపులోని తన కార్యాలయంలో సిద్ధం కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18న సిద్ధం సభ జరుగుతుందన్నారు. ఈసభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. సంక్షేమ పథకాల ద్వారా సీఎం అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించి వారి గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ సారి కూడా ఉమ్మడి జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 14 అసెంబ్లీ, 2 పార్లమెంటు సీట్లలో ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అంటేనే అబద్ధాలు, అవినీతి, బంధుప్రీతి, మోసాలకు మారుపేరు అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన బాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అందుకే వారు ఆయనను నమ్మరన్నారు. సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు నన్నూరు బేగ్, రవి, అర్జున్, మధు, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: జిల్లాలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. నన్నూరు సరస్వతి ఆలయం, కర్నూలు గో సంరక్షణ శాల, ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం, సంకల్ భాగ్ హరి హర క్షేత్రం, సూర్యనారాయణ స్వామి ఆలయం, పలు విద్యా సంస్థల్లో బుధవారం మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకొని జ్ఞాన స్వరూపిణి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. నన్నూరు సమీపంలోని సరస్వతీ దేవి ఆలయంలో తెల్లవారు జాము నుంచే అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక హోమాలు, చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి



కొండజూటూరు గ్రామంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18వ తేదీ నిర్వహించనున్న 'సిద్ధం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కొండ జూటూరు గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలన్నారు.

ఆదర్శ గ్రామంగా కొండజూటూరు

నియోజకవర్గంలో 'కొండజూటూరు'ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామని, ఏళ్ల నాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండ జూటూరు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. నాలుగేళ్లలో కోట్ల రూపాయల మేరా అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రధాన రస్తా నుంచి పాఠశాల వరకు రూ. 20 లక్షల ఎంపీ నిధులతో సీసీరోడ్లు వేసినట్లు చెప్పారు. అలాగే డీఎంఎఫ్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్లు, పాఠశాల నుంచి కాలనీ వరకు రూ.5 లక్షలతో మరో సీసీరోడ్డు వేసినట్లు చెప్పారు. అలాగే జేజేఎం కింద రూ. 35 లక్షలతో 9వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి ప్రజలకు సురక్షిత మంచినీరు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నూతన ఆర్‌బీకే నిర్మించి అందుబాటులోకి తెచ్చామన్నారు. కొండజుటూరు-పాలూరు గ్రామాల మధ్య రూ. 1.60 కోట్లతో బీటీ రోడ్డు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, కర్నూల్ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

గడివేముల: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. కరిమద్దెల గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు.

విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదవాలి



మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(అర్బన్): పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ కోరారు. బుధవారం స్థానిక శ్రీధర్ కోచింగ్ సెంటర్‌లో సీఈడీఎం , మైనారిటీ సంక్షేమశాఖ సహకారంతో మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా గ్రూప్-2 మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన పిల్లలకు ఉన్నత విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జగనన్న విద్యా, వసతి దీవెనతో పాటు విదేశాల్లో చదువుకునేందుకు కూడా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీఈడీఎం డైరెక్టర్ డా.ఎండీ మస్తాన్‌వలి, డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సామీఉద్దీన్ ముజామ్మిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగర ప్రజల నుంచి ఎమ్మెల్యే హఫీజఖాన్ వినతులు స్వీకరించారు. బుధవారం ఎమ్మెల్యే తన స్వగృహంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ ఉన్నతాధికారులతో మాట్లాడారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కర్నూలు (టౌన్) : నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం నగరంలో పెద్ద ఎత్తున ఫాగింగ్, మురుగు కాల్వల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికమైందన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు ముమ్మరం చేశామన్నారు. అదనంగా సిబ్బందిని నియమించడంతో పాటు కొత్తగా రూ.5 లక్షలు వెచ్చించి ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశామన్నారు. హంద్రీ, తుంగభద్ర నదుల్లో పెరిగిన గుర్రప్పు డెక్కతో దోమలు వ్యాప్తి జరుగుతున్నట్లు గుర్తించి వాటిని తొలగించే పనులు ముమ్మరం చేశామన్నారు.

ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలని ఏపీజేఏసీ జిల్లా వైస్ చైర్మన్ జవహర్‌లాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఉద్యోగుల డిమాండ్లను వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న డీఏలకు నిధులు కేటాయించాలన్నారు. పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు,మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రమణయ్య పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి సన్మానం

కర్నూలు కల్చరల్: డాక్టరేట్ పొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) గణిత శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎల్.నాగరాజును కళాశాల ప్రిన్సిపాల్ జె.హేమంత్, అధ్యాపకులు అభినందించి సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నాగరాజు 'పోరస్ మాధ్యమం ద్వారా అస్థిర మాగ్నిటో హైడ్రో డైనమిక్ ఉష్ణ ప్రసరణ ప్రవాహాల ఉష్ణ బదిలీ విశ్లేషణ' (హీట్ ట్రాన్స్‌ఫర్ ఎనాలసిస్ ఆఫ్ అన్‌స్టెడీ మాగ్నెటో హైడ్రో డైనమిక్ కాన్వెక్టివ్ ఫ్లోస్ త్రూ పోరస్ మీడియం) అనే అంశంపై చేసిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. పరిశోధన పర్యవేక్షకులుగా ప్రొఫెసర్ కిషన్ మార్గదర్శనం చేశారన్నారు.